రచన :
‘ వనఫూల్ ’

యుగాంతరము

అనువాదం :
“ చక్రపాణి ”

ఏక్‌కడీ మునిమనమడూ, దుకడీ మనుమడూ, తీన్‌కడీ పుత్రుడూ అయిన పాంచకడీ పోద్దార్ తన పుత్రుడైన ఛకడీ విషయమై చిక్కులో పడ్డాడు.

హారిణహాటీ గ్రామంలో పాంచకడీ పోద్దారును అందరూ గౌరవిస్తారు. నిజానికి ఆయన ఆ ఊళ్లో మణిపూసలాంటి వాడు. అన్ని విషయాల్లోనూ ఆయన అభిప్రాయమే ప్రామాణికంగా ఎంచబడుతుంది. అన్ని విషయాల్లో తన అభిప్రాయాన్ని వెల్లడించటానికి తగిన మానసిక స్థిరత్వం కూడా ఆయనకు ఉంది. ఏ విషయమైనా తీసుకోండి—సంగీతంకానీ, సాహిత్యంకానీ, చిత్రకళకానీ, సినిమాకానీ, ఈనాటి సాంఘికస్థితి కానీ, స్త్రీవిద్య కానీ, మార్కెట్టు ధరలు కానీ, మహాత్మా గాంధీని గురించికానీ—ఆయన వేలెత్తి చెప్పారంటే హారిణహాటీ గ్రామంలో ఉన్నవారంతా మహదానందంతో ఒప్పుకుంటారు. ఒప్పుకొని తాము ధన్యులయామనికూడా అనుకుంటారు.

వేరే మార్గంకూడా లేదు, వారికి.

పాంచకడీ పోద్దార్ చాలా ధనవంతుడు. ఆ ఊళ్లో ఉండే పెద్ద పెద్ద వారంతాకూడా అతని దగ్గర అప్పు తీసుకున్నవాళ్లే. కాబట్టి హారిణహాటీ గ్రామంలో సంగీతం కానీండి, సాహిత్యం కానీండి, మహాత్మాగాంధి కానీండి—వీటిమీద వీరి అభిప్రాయమే చివరిది, తిరుగులేనిది. దీనికి ఆశ్చర్యపడేవారిని ఒకమాటు హారిణహాటీ గ్రామం పోయి చూచిరమ్మని కోరుతున్నాను. నీరు లేకపోతే చెరువు ఎందుకూ ఎలా కొరగాదో, అలాగే పోద్దార్ లేకపోతే హారిణహాటీకూడా ఎందుకూ కొరగాదని మీరు గమనిస్తారు. పోద్దార్ మహాశయుడు ఈ ఆస్తి సంపాదించటానికి అతని జీవితంలో ఎన్నో రకాల అభిప్రాయాలకు తావు ఇవ్వవలసి వచ్చింది. ఈ అభిప్రాయాలే అవసరాన్ని బట్టి ‘అక్కడ [illegible] డక్కడా అంటూ తిరగటం ఆయనకు జీవితంలో ఒక క్రీడ అయిపోయింది. అయన అభిప్రాయాలు విపులంగా చెప్పటమూ, విమర్శించటమూ ఈ కథకు అనవసరం. ఐహా

పాంచకడీపోద్దార్‌గారు ఎద్విధమైన ఆధునిక మార్పుకూ ఇష్టపడడని మాత్రం తెలుసుకొని ఉండండి. ఆయ నింత వరకు చెప్పులు తొడగటం ఎవ్వరూ చూడలేదు. పాదుకలే వాడుతూ ఉంటాడు.

ఇలాంటి పాంచకడీ పోద్దార్ పుత్రుడైన ఛకడీపోద్దార్ దగ్గర దెబ్బతిన్నాడు. అతని చిన్నకొడుకు సాత్‌కడి చచ్చిపోయిన తర్వాత అతని భార్య ఛకడీని ఎంతగా నెత్తిన ఎక్కించుకున్నదంటే వాడిప్పుడు కిందవైపు చూడటమే మానేశాడు, పైవంక తప్ప. వాడు కలకత్తాపోయి చదువుకుంటానన్నప్పుడు దూరదర్శి అయిన పోద్దార్ మహాశయుడు అప్పుడే వల్లకాదన్నాడు. బి.ఏ., యమ్.ఏ. పాసయితే పది తలలూ, ఇరవై చేతులూ రాబోయినవా ఏమిటి? వాదం కోసం వస్తాయనే ఒప్పుకుందాము—ఏమి ఒరిగిందీ? ఈ రోజుల్లో అన్ని తలలూ, చేతులూ పెట్టుకుని ఏంచేసుకుంటాము! కాని భార్య వినలేదు. ఇతని బుద్ధికీ పొరకమ్మి ఆఖరికి ఆడవాళ్లకి లొంగాడు—ఇప్పుడు చూడండి—కుర్రవాడు లవ్‌లో పడ్డాడు.

౨

కుర్రవాడు లవ్‌లో పడ్డాడంటే మొదట పోద్దారు గారికి ఏమో అర్థం కాలేదు. అతని ప్రియ మిత్రుడైన మాధవకుండు సహాయంతో తన కొడుకు రాసిన ఉత్తరాన్ని అర్థంచేసుకున్నాడు.

అసలు విషయం ఇది :

ఒకనాడు తీరిగ్గా పాంచకడీ పోద్దార్ ఆలోచించి కొడుక్కు ఇరవై రెండోయేడుకూడా వెళ్లిపోయినా ఇంకా పెళ్లి చేయలేదనీ, ఇది చాలా అన్యాయమనీ తేల్చుకున్నాడు. పెళ్లిసంగతి తీసుకువస్తే ఛకడీ చదువుమాట అడ్డుపెడతాడు. కాని వీడిని ఇలా వదలకూడదనీ, బలవంతానైనా పెళ్లి చెయ్యటం కర్తవ్యమనీ, నిర్ణయించుకున్నాడు. ఇది సాధు సంకల్పమని మాధవకుండు కూడా ఆమోదించాడు. యవ్వనంలో పెళ్లిచేయక పోతే అనుకోని

పేమైనా జరగవచ్చు—అందులో కలకత్తావంటి పట్టణంలో ఉంటూ ఉండేగా.

పోద్దార్ మహాశయుడు తన బాల్య మిత్రుడూ, స్వజాతీయుడూ అయిన విశ్వనాథుని కుమార్తెను కోడలుగా తెచ్చుకోటానికి నిర్ణయించుకున్నాడు. చాలా కాలం క్రిందటే విశ్వనాథుడితో చాటుగా మాట్లాడి సంబంధం ఖాయంకూడా చేసుకున్నాడు.

విశ్వనాథుడు కలకత్తాలో పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నాడు. వ్యక్తికూడా చాలామంచివాడు. ఈయనికి చాలా ఇష్టం అతనంటే—పైగా బాల్య మిత్రుడు. నాలుగు సంవత్సరాల క్రితం అతను ఈ ఊరు వచ్చినప్పుడు అతనికి మాట కూడా ఇచ్చేశాడు. కాబట్టి ఆ సంబంధం చేయటమే మంచిది. మాధవకుండు కూడా ఇతని అభిప్రాయంతో ఏకీభవించాడు. మాట ఇచ్చినాక అంటే ఈ నాలుగు సంవత్సరాలనుంచీ-పోద్దారూ విశ్వనాథునీ మధ్య ఈ పెళ్లికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరుగుతున్నై. పోద్దారు మహాశయుడు తనకాబోయే కోడలిని గురించి విశ్వనాథుడికి ఇలా రాసేవాడు :

“ చూడవోయి విశ్వం ! పిల్లని అంత ఫేషన్‌బుల్‌గా తయారు చేయ మాకు, స్కూల్లో చదివిన ఈ ఫేషన్‌బుల్ పిల్లలు చేసేపనులు చూస్తుంటే నా వొళ్లు మండుతూ ఉంటుంది. మన అమ్మాయిని ఇంటి పనుల్లో బాగా తయారు చేయి. మా ఆవిడ ఇప్పుడుకూడా వడ్లు దంచగలదు; మూడు యజ్ఞాలకి వంటచేసి పెట్టగలదు. ఆమె పెట్టిన ఆవకాయతిని ఊరంతా మెచ్చుకుంటూరు. చూడు విశ్వం ! అమ్మాయి ఆ దోవను పడకుండా మాత్రం చూడు...”

విశ్వనాథం జవాబు రాసేవాడు.

“ నీవు ఈ విషయంలో ఏమీ ఆలోచనలు పెట్టుకో వద్దు. అమ్మాయిని ఇంటిపనుల్లో తయారుచేయటానికి నేనే మాత్రం సంకోచించటంలేదు. నీ కోడలు మసాలా దంచటం దగ్గరినించి గుడ్డలు ఉతకటంవరకు-అన్ని విధాలైన ఇంటి పనులూ చేస్తూ ఉన్నది. ప్రస్తుతం అది ఉలు అల్లికా, లేసు కుట్టూ నేర్చుకుంటున్నది. మొన్న ఈ మధ్య పట్టుగుడ్డమీద హంసను కుట్టింది. నిజంగా అది చూస్తే ఆశ్చర్యం వేస్తుంది......”

దీనికి జవాబుగా పోద్దార్ రాశాడు—

“ ఊలు అల్లికా, లేసు కుట్టూ మామూలు గృహస్తులకు ఎందుకూ పనికిరావు. పట్టుగుడ్డమీద కుట్టిన ఊలుహంస కూడా ఎందుకు పనికివస్తుందో నాకు అర్థం కావటంలేదు. నువ్వు బుద్ధిమంతుడవి, చదువుకున్నవాడివి-నీకు ఉపదేశించటం నాకు శోభించదు. కాని నీకు మరీ మరీ చెప్పేది ఏమంటే అమ్మాయిని ఫేషన్‌బుల్‌గా తయారుచేయమాకు మని. కాలంకూడా బాగాలేదు. మాధవకుండు వార్తా పత్రికలు చదివి ఈనాటి కబుర్లు చెప్పుతూఉంటే నాబోటి మూర్ఖుడి బుర్రకూడా తిరిగి పోతూవుంది—”

తిరుగు టపాలోనే విశ్వనాథుడి దగ్గరినించి జవాబొచ్చేది.

“ ఊలు అల్లికా, లేసు కుట్టూ మానిపించేశాను. పట్టు గుడ్డలమీద బొమ్మలు కుట్టడంకూడా అనవసరమే—”

ఈ విధంగా నాలుగు సంవత్సరాలనించి గడుస్తున్నది.

ఛకడీకి ఈ సంగతి ఏమీ తెలియదు.

అతడు కలకత్తా మెస్‌లో ఉండి చదువుకుంటున్నాడు. పెళ్లి సంగతి వస్తే చదువు పూర్తి అయితే గాని చేసుకోననేవాడు—

కాని మాధవకుండు ప్రోత్సాహమూ సలహామీద కొడుకు బలవంతాన తప్పితే తన ఇష్టంమీద పెళ్లి చేసుకోడని పోద్దార్ నిశ్చయించుకున్నాడు. ఈనాటి కుర్రవాళ్ల వ్యవహారాలన్నీ అదోకరకం. ఈ సందర్భంలో మాధవకుండు ఈనాటి పాశ్చాత్య విద్యలో ఉన్న దోషాలన్నీ తూరుపార పట్టాడు.

మర్నాడే పోద్దార్ మాధవకుండు చెప్పిన ప్రకారం ఛకడీకి ఉత్తరం రాశాడు. అందులో 17వ తారీఖున పెళ్లికి లగ్నం కుదిరిందనీ వెంటనే బయలుదేరి రమ్మని వ్రాశాడు.

3

దీనికి జవాబుగా ఛకడీ రాసింది చూసుకొని పాంచకడీ నివ్వెరబోయాడు. పాశ్చాత్య విద్య పరిణామం ఇంత భయం

http://www.maganti.org/

కరంగా ఉంటుందని అతను ఊహించనుకూడా లేదు. వెంటనే మాధవకుండుకు కబురుచేశాడు. ఇలాంటివి జరగటానికి ఎలా వీలు ఉందో కూడా అతనికి తోచటంలేదు.

ఛకడీ వ్రాశాడు :—

“ నాన్నగారూ ! నన్ను క్షమించండి. నేను దాదాపు ఆరు మాసాల క్రిందటే వివాహం చేసుకున్నాను. స్త్రీ విద్యకు ప్రబల విరోధులని మీకీ సంగతి తెలియపర్చలేదు. పిల్ల కొంచెం చదువుకున్నది. మెట్రిక్ పాస్ అయింది. నన్ను క్షమించి అభయంగనక ఇస్తే మేము ఉభయులమూ మీ ఆశీర్వాదం పొందటానికి మీ దగ్గరికి వస్తాము—మిగతా వివరాలు కూడా చెప్పుకుంటాము.”

కుండు రాగానే ఉత్తరం ఆతని చేతికి ఇచ్చి—“ ఛకడీ రాసిన ఉత్తరం ! చదివిచూడు—ఇది నాకేమి అర్థం కావటంలేదు. పోద్దార్ వంశంలో ఇలాంటి కొరగానివాడు పుట్టటమా ! ” అన్నాడు.

కుండు మాట్లాడకుండా ఉత్తరం చదివి, కాసేపు ఉండి—“ లవ్‌లో పడ్డాడు—” అన్నాడు.

“ ఎందులో పడ్డాడు ? ”

“ లవ్—లవ్‌లో—అంటే ప్రేమలో—”

విని పోద్దార్ విస్తుపోయాడు. ఆ తర్వాత—“ దీనికి మూలమెవరో తెలుసునా ? ” అన్నాడు.

“ పాశ్చాత్య విద్య—”

“ కాదు. నా భార్య ! దానిమాట వినే నేను వీణ్ణి కలకత్తా పంపాను. ఉత్తరం ఏదీ ? ”

పోద్దార్ ఉత్తరం తీసుకుని పాదుకలు టకటక లాడించుకుంటూ అంతఃపురంలోకి వెళ్లాడు. భార్యతో జరిగిన సంభాషణ ఇక్కడ వ్రాయటానికి నేను కొంచెం సందేహిస్తున్నాను.

మర్నాడు ఇంకో కాండ జరిగింది. దానికి ఫలితంగా పోద్దార్ మహాశయుడు హారిణహాటీ గ్రామం వదలిపెట్టాడు. ఆ కాండ ఇది. విశ్వనాథుడి దగ్గరనించి ఒక ఉత్తరం వచ్చింది—అతను మర్నాడు వస్తున్నాడట.

దిక్కుతోచని పోద్దార్ మాధవకుండు దగ్గర విశ్వానికి తను ముఖం చూపించలేనని బయట పెట్టాడు. ఈ హారిణహాటిలో ఉండటం అంతకంటే కష్టమనికూడా చెప్పాడు.

“ ఐతే పదరాదూ, ఒకమాటు బృందావన క్షేత్రమన్నా చూసివద్దాము, ఒక్క దెబ్బని రెండు పిట్టలు !” అన్నాడు.

పాంచకడీ పోద్దార్ తీర్థయాత్రలకి బయలుదేరాడు. కుండుతోడు.

౪

నిండు ఆరు మాసాలు పోద్దారు మహాశయుడు తీర్థయాత్రలు సేవించాడు. కుండు వెంట ఉండబట్టి ప్రయాణం బాగానే ఉంది. తిరిగి ఇంటికి వద్దామనుకుంటూ ఉండగా, కాశీలో అతనికి విశ్వనాథుడు రాసిన ఉత్తరం అందింది. అది ఇది—

“ హారిణహాటీ వస్తే నీ జాడ చిక్కలేదు. నీకు ఉత్తరం వ్రాయటానికి కూడా నీవు ఇంట్లో ఏ అడ్రసూ ఇచ్చిపోలేదు. ప్రస్తుతం నువ్వు కాశీలో ఉన్నావనీ, ఇంకా కొంతకాలం అక్కడే ఉండదలచుకున్నావనీ సూచించే ఉత్తరం కుండుగారు హారిణహాటీ రాశారు. నేను దాని ద్వారానే అడ్రసు సంపాదించి నీకీ ఉత్తరం రాస్తున్నాను. నీకు అన్ని సంగతులూ విప్పిచెప్పటానికి నాకు అవకాశం కలగలేదు. అంచేతనే ఇప్పుడు నిష్కపటంగా ఏమీ దాచకుండా నీకు రాస్తున్నాను—నీ క్షమాభిక్షకూడా కోరుతున్నాను.

నీవు స్త్రీ విద్యకు విరోధివని నేను నా పిల్లను చదివిస్తున్న సంగతి నీకు వ్రాయలేదు. నిన్ను కలుసుకున్న తర్వాత చల్లగా నీకు చెప్పి ఒప్పిద్దామని అనుకున్నాను. చదువు సంధ్యలు నేర్చుకోవటం ప్రతివారి కర్తవ్యమని నా నమ్మకం. ఇందులో తప్పేమీ నాకు కనిపించటంలేదు.

“ చిరంజీవి ఛకడీ చదువుకు కలకత్తా వచ్చినాక తరుచుగా మా యింటికి వస్తూఉండేవాడు. కుసుమతో బాగా స్నేహంకూడా కలిసింది. కుసుమ ముందు అతని భార్య కాబోతూ ఉండటంచేత నేనుకూడా వాళ్ల కలయికకు అడ్డురాలేదు. కాని ఒకనాడు నా భార్య వీళ్ల కలయిక చాలా దూరం పోయిందనీ, ఇక పెళ్లి చెయ్యక తప్పదనీ చెప్పింది. నేనా సంగతి ఒకనాడు ఛకడీకి స్పష్టంగా

http://www.maganti.org/

చెప్పాను. అతను వెంటనే వివాహం చేసుకోటానికి వొప్పుకోలేదు. పిల్ల చదువుకున్నదనీ, మెట్రిక్ పాసయిందనీ తెలిస్తే కుండుగారి ప్రోద్బలంవల్ల మీరు ఈ వివాహం జరగనివ్వరని. నీ సంగతి నాకూ తెలుసు—అసలే రెట్టమతం వాడివి-ఎదురు తిరగవచ్చు. ఈ సంగతులన్నీ ఆలోచించి నీకు వ్రాయకుండానే కుసుమని మీ అబ్బాయికిచ్చి పెళ్లి చేసాను. ఆరు మాసాలు నిర్విఘ్నంగానే గడిచినై. ఆ తర్వాత పెళ్లి చేసుకున్నానని నీకు ఫకడీ జావాబు వ్రాయటము చూసి ఇక దాచి లాభంలేదనీ నీకు అన్ని సంగతులూ వివరంగా చెప్పాలనీ నిశ్చయించుకున్నాను. ఈ ఉద్దేశంతోటే నేను హరిణహాటీ వచ్చాను. కాని తీరా అక్కడికి వచ్చినాక నువ్వు బృందావనం పోయావని తెలిసింది.

"ఇప్పుడు విషయమంతా నీకు వ్రాశాను. నేను నీ బాల్య మిత్రుణ్ణి. నన్ను క్షమించటం నీవల్ల కానట్లయితే వచ్చి రెండు తన్ని అయినా పో. కాని అబ్బాయినీ, అమ్మాయినీ తిరస్కరించమాకు. కుసుమ స్కూల్లో చదివినా ఇంటి పనుల్లో మంచి నిపుణత సంపాదించింది. నీవు స్వయంగా వచ్చి పరీక్షచేసి చూడవచ్చు......" మొదలైనవి.

×

చాలాకాలానికిగా పోద్దారుగారు హరిణహాటీ వచ్చారు. అతను ఊళ్లోకి వచ్చి చూసిందేమంటే :—అతను లేని ఈ అదను చూసుకొని కొంతమంది ఊళ్లో కుర్రవాళ్లు బట్టర్ ఫ్లైషామను మీసాలు పెట్టారు. మల్లిక్‌గారి ఇంటిముందర కొత్తగా క్రోటన్లు వెలిసినై. పోద్దారుగారు ఏమీ మాట్లాడకుండా కుండుగారి ముఖంవంక చూశారు.

కుండు నవ్వి—"అన్నీ గమనించాను—" అన్నాడు.

* * *

పోద్దారు మహాశయుడు అంతఃపురంలోకి వచ్చి చూచాడు—అతని భార్య ఒక సుందరికి తల దువ్వుతూ ఉంది—కోడలు !

పోద్దారును చూసి ఆయన భార్య ఆదరాబాదరా గుడ్డ సవరించుకుని లేచినుంచుంది. కోడలు పరుగెత్తుకుంటూ ఇంట్లోకి పోయి దాక్కుంది.

"కబురుకూడా చెయ్యకుండా హఠాత్తుగా ఊడిపడ్డారే? సరే—బ్రతికించారు ! వొంట్లో కులాసేనా ?" అని అడిగింది భార్య.

పోద్దారు మహాశయుడు వీటికేమి జవాబులివ్వకుండా, దగ్గరలో ఉన్న ఉయ్యాలకేసి చూపుతూ—"అదేమిటి ?" అని అడిగాడు.

"సాడె ! ఫకడీకి కొడుకు పుట్టాడుగా ! అమల కుమార్—"

"ఏమిటీ ?"

"అమలకుమార్ ! అమ్మాయి వాడికి అమలకుమార్ అని పేరు పెట్టింది."

పోద్దార్ స్తంభించి పోయాడు.

ఆశ్చర్యం కొంచెం తగ్గినాక అన్నాడు :—"అమల కుమార్‌ను పెట్టుకుని మీరు ఉండండి ! నేను కాశీ పోతున్నాను—"

అని నిజంగానే బయులుదేరాడు.

భార్య ఆయనకు అడ్డువచ్చి అన్నది :—"అయ్యో ! అదేమిటండీ !—రాత—"

"అమలకుమార్ అనే పేరు నేనెంత మాత్రం సహించను—"

"ఇంకేం, మరింకో పేరు పెట్టుకోరాదూ ?"

"నాకడీ—"

"భేష్, అలాగే పిలుద్దాము—"

పోద్దారు మహాశయుడు వెనక్కు తిరిగి ఉయ్యాలవేపు నడిచాడు.

http://www.maganti.org/

Source: Press Academy Website, Andhra Mahila, Aug 1944

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan